# నీళ్లకుండ

**"ఆ మామిడి పిందెల డిజైనున్న చీరకట్టుకో. అది బాగుంటుంది."**

"ఏదీ! మొన్న పండక్కి మీరు కొన్నదా?'

"ఆc. అదే. పెద్ద పెద్ద పువ్వులున్నది. లేత పసుపు పచ్చది. అది బ్రహ్మాండంగా వుంటుంది."

"అదా. అదెందుకు? ఇది కట్టుకుంటాను. ఇటు చూడండి. ఈ చిన్న చిన్న పువ్వులున్న ఎర్రచీర బాగులేదూ? ఇది ఎంతో బాగుంది. ఇది కట్టుకుంటానండీ."

"ఛ, అదేం బాగుంది? ఎర్రగా నెత్తురులాగా రంగూ అదీను. నేను చెప్పిన చీర కట్టుకో."

"వూహుc. అదొద్దు. నేను యీ చీరే కట్టుకుంటాను. నాకు అది అంత నచ్చలేదు."

"అదేమిటి? ఆ చీర నచ్చలేదా? తెచ్చినప్పుడు అంత బాగుందన్నావ్!"

"అవును. తేగానే నచ్చలేదని చెప్పేస్తే మీరేం అనుకుంటారోనని అలాగన్నాను. అంతేగాని నాకు నిజంగా నచ్చలేదు. ఆ చీరా కట్టుకుంటాను లెండి, మరెప్పుడైనా. ఇవాళమాత్రం నాకు నచ్చిన చీర కట్టుకో నివ్వండి."

"ఎందుకంత మొండితనం నీకు? నేను చెప్పిన చీర కట్టుకుంటావా, లేదా? నువ్వు తీసిన చీర ముందు బీరువాలో వుంచు. ఈ చీర కట్టుకో త్వరగా. అవతల టైమయి పోతున్నాది."

"చీర కట్టుకునేది నేనా? మీరా? నాయిష్టం వచ్చిన చీర కట్టుకోడానికి కూడా మధ్యన మీ పంతం ఏమిటి?"

"పంతం నాదా, నీదా? నేను చెప్పిన చీర కట్టుకో. మరీ అడ్డదిడ్డంగా వాదించకు. నాకు వళ్లు మండుతుంది."

"పంతం నాదా? ఎందుకు అనవసరంగా వాదిస్తారు? మీ బట్టల విషయంలో నేనెప్పుడైనా ఇంత గొడవ చేసేనా? మీరేది కట్టుకున్నా నేనేమైనా అంటున్నానా?"

"మగాళ్ళ బట్టల విషయం వేరు. మావి ఎలా వున్నా ఫర్వాలేదు?"

"మేం మాత్రం? ఏది కట్టుకుంటేనేమిటి?"

"ఏది కట్టుకుంటేనేమిటి- అన్నప్పుడు నేను చెప్పిందే కట్టుకోవచ్చుగా. ఈ వాదనంతా దేనికి?"

"ఎవరు వాదించారు?"

"నువ్వే."

"నేనేం వాదించలేదు."

"పోనీ వాదించక పోతే నేను చెప్పిన చీర కట్టుకో. నా మాట విను. అనవసరంగా నాక్కోపం తెప్పించకు."

"ప్రతీ విషయంలోనూ మీ మాటే వింటున్నాను. అయినా అలా అనేస్తారు."

"నా మాట వింటున్నానన్నావుగా అందుకే యిప్పుడు కూడా నా మాట విను. నేను చెప్పిన చీర కట్టుకో."

"అబ్బ. ప్రతీదీ మీ మాటే అయిపోవాలి. ఎప్పుడూ మీరు చెప్పినట్టు నేను వినడమే గాని, నేను చెప్పినట్టు మీరెప్పుడైనా విన్నారా?"

"ఏమిటీ? నువ్వు చెప్పినట్టు నేను వినాలా? బాగుంది వరస, నేను నీకు మొగుణ్ణా, నువ్వు నాకు మొగుడివా? పెళ్ళాం మొగుడి మాట విని తీరాలి?"

"ఎక్కడైనా వుందా అలాంటి రూలు?"

"ఆఁ. వుంది. నిక్షేపంలా వుంది. మావంశంలో ఎవ్వరూ యిప్పటిదాకా మొగుడికి ఎదురు చెప్పే పెళ్ళాలు లేరు. నువ్వు అనవసరంగా నా పరువు తియ్యకు. చెప్పినట్టు వినడం నేర్చుకో. వెధవ ఆర్యుమెంట్లూ నువ్వూను. అందుకే అసహ్యం, నీతో ఎక్కడికి వెళ్ళాలన్నా." విసురుగా అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు జగన్నాథం.

నెత్తిమీద నీళ్ళకుండ వుంది సుజాతకి.

కళ్ళల్లోంచి నీరు చిమ్మి పైకి వచ్చింది.

విధిలేక జగన్నాథం కిష్టమైన చీరే తీసింది కట్టుకోవడానికి.

★ ★ ★

"ఛ. ఛ. ఛ. గవాస్కర్ అవుటయిపోయేడు. అరెరె. ఇదేమిటి వాడు కూడా అవుటయ్యేడు? మన ఇండియా గెలుస్తుందా? లేదా? వింటున్నావా. కూర్చో యిలాగ, చెప్తాను విను. మొత్తం పదకొండుగురు వుంటారు. ఇటూ - అటూ వికెట్సు అదేం అలా ముఖం పెట్టావే? వినడం యిష్టం లేదా?"

"నాకేమిటో యీ కామెంట్రీ అంటే తలనొప్పి బాబూ! నాకా క్రికెట్ గురించి చెప్పకండి. నాకు ఒక్క ముక్క కూడా బోధపడదు."

"అయ్యో ఇంతసేపూ చెప్పిందంతా నీకు బోధ పడ్లేదా? ఒఠ్ఠి మట్టిబుర్ర. క్రికెట్టు గురించి తెలియక పోతే మరి దేనికి పనికివస్తావు నువ్వు? ఛ, ఛ! నీకంటె ఆ చంటి వెధవ నయం. ఇట్టే గ్రహిస్తాడు. అసలు నీలాంటి మొద్దు స్వరూపానికి క్రికెట్టు గురించి చెప్పడం ఏమిటి? నాది బుద్ధి తక్కువ! చెవిటివాడి ముందు శంఖం వూదినట్టే!"

"పోనీ. అలాగే అనుకోండి. నాకేం పోయింది. ఏవండీ! మంచి పాట లొస్తాయిప్పుడు. ఒక్క అరగంట...

"నో. నో. పనికి రాదు. వెధవపాటలు ఎప్పుడూ వింటున్నవే."

"అది కాదండీ. ఇవాళ అన్నీ కొత్త సినిమాలలో పాటలే వేస్తారు."

"అయితే ఏమిటంటావు?"

"మీ కామెంట్రీ కొంతసేపు ఆపండి. పాటలు పెడతాను."

"అదేం కుదరదు. నేను కామెంట్రీ వినాలి. వినితీరాలి."

"కొంచెం సేపు పాటలు పెట్టుకుంటానండీ. ఇవ్వండొక్కసారి."

"వీల్లేదు. నువ్వు పాటలు వినకపోతే వచ్చే నష్టం ఏమీలేదు. వెళ్ళి వంట సంగతి చూడు."

"వంట. వంట. ఎప్పుడూ నా పని వంటే? నేనసలు వంట కోసమే పుట్టినట్టున్నాను!"

"ఆడవాళ్లు మరెందుకున్నారు?"

"వంటకా?"

"మరి?'

"అయితే హాయిగా ఏ వంటమనిషినో పెట్టుకోలేక పోయేరా? నన్నెందుకు పెళ్ళి చేసుకున్నారు?"

"మల్టీ పర్పస్సే!"

"ఛీ. సిగ్గులేదు మనిషికి."

"ఆడదానివి. సిగ్గు నీకుండాలి? నాకెందుకు సిగ్గు?"

"సరేకాని. అయితే రేడియో యివ్వరన్న మాట."

"అది మాత్రం అడక్కు. తప్పు తప్పు. బుద్ధిగా వెళ్ళి నీ వంట సంగతి నువ్వు చూసుకో."

అహం దెబ్బతింటున్నా అణిగి మణిగి వుండడం అలవాటయిన సుజాత అక్కడ్నుంచి కదిలింది.

★ ★ ★

"ఏం కూర చేస్తావ్?"

"ఏమిటి చెయ్యమంటారు?"

"నీకేం తోస్తే అది చెయ్యి."

"బంగాళదుంపలు మసాలా పెట్టి చేస్తాను."

"ఛ. ఛ. అదా! నాకు పరమ అసహ్యం. వంకాయ అల్లం, పచ్చి మిరపకాయలు వేసి చెయ్యి. బాగుంటుంది."

"మీకు బాగుంటే సరా? నాకు చిరాకు ఆ కూరంటే."

"నాకూ చిరాకే దుంపలకూరంటే."

"ఒక్క రోజుకేమిటిలెండి. ఎలాగో సర్దుకోండి."

"ఆ సర్దుకోవడం ఏదో నువ్వే చెయ్యకూడదూ. నాకేం ఖర్మ, ఏదో ఒక కూర సర్దుకుని తినడానికి?"

"మరి నీకేం తోస్తే అది చెయ్యి - అని ఎందుకన్నారు?"

"నా యిష్టాయిష్టా లేవో నీకు బాగా తెల్సు కదా. అందుకని నా కిష్టమయిన కూరపేరే చెప్తావనుకున్నాను!"

"మీరు అన్నింట్లోనూ మీ 'యిష్టం' వచ్చినట్టే చెయ్యమంటే ఎలాగ? నేనూ మీలాంటి మనిషినే కదా, నాకూ మీలాంటి యిష్టాయిష్టాలుండవా?"

"నీకు యిష్టాలుండవని ఎవరన్నారు? నీ యిష్టం వచ్చినట్టు నువ్వుండు. నా యిష్టం వచ్చినట్టు నేనుంటాను. కాని నా యిష్టం వచ్చినట్టు నువ్వుండదల్చుకుంటేనే నాతో వుండు. ప్రతీదానికీ నాతో ఎడీ అంటే పెడీ అని వాదిస్తావు. అందుకే నీతో మాట్లాడ్డానికి అసహ్యం వేస్తోంది. ఇదుగో వంకాయలు. యిక్కడ పెట్టేను. వంకాయకూర చెయ్యి.

నెత్తిమీద నీళ్ళకుండ వుంది సుజాతకి.

కళ్ళల్లోంచి నీరు చిమ్మి పైకి వచ్చింది.

దుఃఖాన్ని దిగమింగి వంకాయలు తరగడానికి కూర్చుంది.

★ ★ ★

"ఏమిటివాళ చాలా హుషారుగా కన్పిస్తున్నావ్? ఏం సంగతి?"

"ఏం లేదండీ!"

"శేఖరంతో చాలా సరదాగా మాట్లాడేస్తున్నట్టున్నావు!"

"అదా. అతనేదో అంటే నాకు నవ్వు వచ్చింది. నవ్వేను. అంతే."

"అంతలా నీకు నవ్వొచ్చేమాట ఏమిటన్నాడేమిటి?"

"అదేమాటో జ్ఞాపకం లేదండీ."

"ఓకే. చెప్పడం యిష్టం లేదు కాబోలు. దాచుకో."

"అదేమిటండీ అలా అంటారు? నిజంగానే జ్ఞాపకం లేదు. అతను చాలా సరదాగా మాట్లాడతారు. ఏవో జోకులేసి నవ్విస్తారు కదా."

"అవునవును. వాడి బోడిజోకులకి నీ ఒక్కర్తికి నవ్వొస్తుంది. మరెవ్వరికీ రాదు. వాడెలాంటి దొంగవెధవో నీకు తెలీదు."

"అదేమిటి? అంత పెద్ద వుద్యోగం చేస్తున్నాడు!"

"చేస్తే? దొంగవేషాలు ఎక్కడికి పోతాయి?"

"అంటే?"

"వాడు... పేరుకు వుద్యోగం వెలగబెడ్తున్నాడు. కాని ఇరవై నాలుగంటలూ ఆడవాళ్ళని ఎలా ట్రాప్ చెయ్యాలా అనే చూస్తుంటాడు! అదేపని... వాడికి!"

"నిజంగానా?"

"ఏం? నీకు సరదాగా వుందా?"

"ఛీ. ఛీ. ఆవేం మాటలండీ? నాకు సరదా ఏంటి మధ్యన?"

"ఏమో?!"

"మీరన్నది నా కర్థం కావడం లేదు."

"పాపం. ఇంకా చిన్నపిల్లవి కదా. అర్థం కాదు. ఇంకా విడమర్చి చెప్పాలా? వాడు యీసారి మాట్లాడితే నువ్వు నవ్వకు."

"నవ్వొచ్చినా నవ్వకూడదా? మూతి బిగించుక్కూర్చోవాలా?"

"ఆ మాత్రం 'నవ్వు'ని ఆపుకోలేవూ? అయినా పరాయి మగాడి ముందు నవ్వడానికి నీకు సిగ్గుండాలి."

"నేను అంతదూరం ఆలోచించలేదండీ. పోనీ అతన్తో మాట్లడ్డం మీ కిష్టం లేదంటే మానేస్తాను కాని..."

"ఏమిటి కానీ...?"

"మీరు మనింటి కొచ్చిన ఆడవాళ్ళందరితోటి ఫ్రీగా, నవ్వుతూ మాట్లాడేస్తూంటారు. మరప్పుడు నేనేమైనా అన్నానా?"

"నేను మగాడ్ని! నేను నవ్వినా నన్ను ఈ లోకం ఏమీ అనదు. నువ్వు ఆడదానివి. ఆడదానికి "నవ్వు" నాలుగువిధాల చేటు! అయినా వాడితో నీకు మాటలేమిటి? అలా నవ్వితే ఎవరైనా వాడికీ నీకు ఏదో వుంది అనుకుంటారు!"

"మీరు నవ్వించినప్పుడు, నీరజ, సత్యవతి, శశిరేఖ వాళ్లందరూ తెగనవ్వుతారు. వాళ్ళందరి గురించి లోకం ఏమీ అనదా? వాళ్ళూ ఆడవాళ్ళే కదా!"

"నీకు ఈమధ్యన వితండ వాదన ఎక్కువైంది. నువ్వు నా పెళ్ళానివి. నా యిష్టం వచ్చినట్టు నువ్వుండాలి. నాకు వాళ్ళందరి సంగతి అనవసరం. వాళ్ళెవరూ నా పెళ్ళాలు కారు. తెల్సిందా! అర్థం పర్థం లేకుండా నోరు వుంది కదా అని వాగకు. చెప్పినట్టు విను."

నెత్తిమీద నీళ్ళకుండ వుంది సుజాతకి.

కళ్ళల్లోంచి నీరు చిమ్మి పైకి వచ్చింది.

దుఃఖోద్వేగాన్ని ఆపుకుంది అతి కష్టం మీద.

★ ★ ★

"ఏమండీ మా నాన్నగారి వంట్లో బాగులేదట. ఉత్తరం వచ్చింది."

"అయితే ఏమిటంటావు?"

"ఒక్కసారి వెళ్ళి చూసొస్తానండీ దగ్గరే కదా."

"ఇప్పుడా? ఇప్పుడు వద్దు. రేపట్నుంచి మా ఆఫీసుకు వర్కు ఎక్కువగా వుంటుంది. ఇంటికి ఆలస్యంగా కూడా వస్తాను. నువ్వెళ్ళిపోతే ఇంట్లో ఎలా గడుస్తుందను కున్నావు?"

"ఒక్క రెండు రోజుల్లో వచ్చేస్తానండీ."

"నువ్వు మరేం మాట్లాడకు. మీ నాన్నగారికి వంట్లో యిప్పుడు బాగానే వుంటుంది, ఒక ఉత్తరం

ముక్క రాసి పడేయి. 'వద్దామనుకున్నాను గాని వీలు లేకపోయింది' అని."

"అదేమిటండీ? కన్న తండ్రికి వంట్లో బాగో లేకపోయినా పంపించరా?"

"నీకు కన్న తండ్రి ముఖ్యమా? కట్టుకున్న మొగుడు ముఖ్యమా? చెప్పు."

"…. …. …"

"పెళ్ళయ్యాక ఆడదానికి మొగుడి తర్వాతే ఎవరైనా? నువ్వెళ్ళిపోతే నా సంగతి ఎవరు చూస్తారు? అందులోను "చలికాలం" కూడాను!"

"అవతల మా నాన్నగార్కి వంట్లో బాగులేక పోతే మీరిలా అంటే ఎలాగండీ?"

"ఎలాగంటే అలాగే. నువ్వు మాత్రం ఇప్పుడు వెళ్ళడానికి అవదు. నేను పంపించను. పొద్దున్ననగా ఆఫీసుకెళ్ళిపోయి సాయంత్రం ఇంటికొస్తే కాఫీ యిచ్చే దిక్కు కూడా లేకుండా నేను ఇబ్బంది పడితే నీకు బాగుంటుందా? నీకు మనసెలా ఒప్పుతుంది? నిన్నసలు దేనికి పెళ్ళి చేసుకున్నది?"

"ఇంతకీ మీరనేది ఏమిటి? పంపించనంటారు. అంతేనా!"

"అంతే."

"మీకు చెప్పకుండా నేను వెళ్ళిపోతే?!"

"ఒకవేళ అలాంటిది గాని జరిగితే అక్కడే వుంటావు. మళ్ళీ ఇక్కడికి రానక్కరలేదు. ఇంతోఅంతో చదువు వెలగబెట్టావు. కదా. ఉద్యోగం చేసుకు బతుకుతావు."

సుజాత మాట్లాడలేదు. ఏ భావమూ లేకుండా భర్తవైపు ఒక్క చూపు చూసింది. ఆ చూపుకి జగన్నాథం ఉలిక్కి పడ్డాడు!

★ ★ ★

తర్వాత కొన్ని నెలలకి...

సుజాత పుట్టింట్లో....

మాసిన గడ్డంతో, లంఖణాలు చేసిన వాడిలా నీరసంగా గుమ్మంలో నిలబడి వున్న భర్తని చూసి ఒక్క అంగలో అతని వద్దకు వెళ్ళింది సుజాత.

అంతలోనే ఆమెకు తను పుట్టింటికి వచ్చేయడానికి కారణమైన సంఘటన జ్ఞాపకం వచ్చింది. అతనికి ఒక్క అడుగు దూరంలో ఆమె ఆగిపోయింది.

"సుజా" అన్నాడు కంఠం పెగల్చుకుని జగన్నాథం.

పెళ్ళయినప్పటి నుంచి అంత సౌమ్యంగా, అతడు పిలవడం ఆమె వినలేదు. అందుకే ఆశ్చర్యంతో తలెత్తి చూసింది.

"సుజా... నిన్ను నాతో తీసుకు వెళదామని వచ్చాను."

సుజాత మాట్లాడలేదు.

"మీ నాన్నగారికెలా వుంది" జగన్నాథం ప్రశ్నకి సుజాత తలెత్తి చూసింది.

"ఫరవాలేదు. ఇప్పుడే కోలుకున్నారు." అంది సాధ్యమైనంత సౌమ్యత తెచ్చి పెట్టుకొంటూ.

"జరిగింది మరచిపోదాం సుజాతా... నువ్వు నాతో..." జగన్నాథం మాట పూర్తి కానేలేదు" సుజాత సూటిగా చూసిన చూపులకు మాటలు మ్రింగి నేలచూపులు చూశాడు.

"ఎంత తేలిగ్గా 'మరచిపోదాం' అన్నారండీ. ఆ రోజు మీరు.... అన్ని విధాలా మీ అవసరాలు తీర్చే ఒక బానిసగా చూశారే తప్ప నాకూ ఒక మనసనేది వుంటుందనీ, నేనూ ఒక మనిషినేనని అనుకున్నారా? అసలా ఆలోచన ఎప్పుడైనా మీకు వచ్చిందా... ఇక పెళ్ళయిన తర్వాత ఆడదానికి భర్త, తన సంసారం ముఖ్యమే; కాదనను. కానీ కూతురిగా నాకు తండ్రి కూడా ముఖ్యమేనండీ. ఇన్నేళ్ళు పెంచి పెద్దచేసి మిమ్మల్ని ప్రయోజకుడిగా తీర్చి దిద్దిన తల్లిదండ్రులు మీకు మాత్రం ముఖ్యం కారా... మీ నాన్నగారికే వంట్లో బాగులేదని ఉత్తరం వస్తే మీరు చూడడానికి వెళ్ళరా... ఆడదీ అంతేనండీ. 'మా నాన్నకి వంట్లో బాగుండలేదని కబురొచ్చింది. రెండ్రోజుల్లో చూసి వచ్చేస్తా'నంటే 'ససేమిరా' పంపనన్నారు మీరు. ఒక వేళ నేను గడపదాటినా మళ్ళా రానవసరం లేదనీ అన్నారు. మీ మాటలే నాకు దారి చూపాయి. అంతవరకు ఎంతో సహనంతో మీరు ఏమన్నా అణిగి మణిగి పడి వున్నాను. కానీ నా పెళ్ళి మీరు  కోరిన ప్రకారం ఘనంగా చేసి అప్పులపాలైన మా నాన్నకి ఈ వయసులో జబ్బు చేస్తే సేవ చెయ్యడానికి కాదు కదా కనీసం చూసి రావడానికి కూడా ఒప్పుకోని మీ కసాయి మనస్తత్వం ఇక భరించ లేకపోయాను. ఆడదానికి నెత్తిన నీళ్ళకుండ ఉంటుందంటారు. ఈ 'నీటికుండే' నా నెత్తిన చూసిన మీరు మీ చిత్తం వచ్చినట్లు ప్రవర్తించారు. ఆడదానికి సహనం సహజ గుణం. నిజానికి అది నీళ్ళకుండ కాదు. సహనంతో నిండిన కుండ. సహనం చచ్చినప్పుడు ఎవరైనా శక్తిస్వరూపిణే అవుతారు. ఆరోజు అదే నా పరిస్థితీను. అందుకే పుట్టింటికి రాగలిగాను. నా తండ్రిని దక్కించుకోగలిగాను" ఆత్మవిశ్వాసంతో అంది సుజాత.

"సుజా... మనుషులు దూరమైనప్పుడే మమతలు పెరుగుతాయంటారు. నీ ఎడబాటులోనే నీ విలువ నాకు తెలిసింది. నేనెంత మూర్ఖంగా ప్రవర్తించానో తెలిసి సిగ్గుపడ్డాను" అన్నాడు జగన్నాథం.

సుజాత నమ్మలేనట్లుగా చూసింది.

"అవును సుజా... ఇంకెప్పుడూ అలా మూర్ఖంగా ప్రవర్తించను. నన్ను క్షమించు" అంటున్న జగన్నాథం మాటల్లో నిజాయితీ, కళ్ళల్లో నిర్మలత్వం ఆమెకి అతనిపై నమ్మకాన్ని కలిగించాయి. అప్పటికే ఆమె పుట్టింటికి వచ్చి ఆరు నెలలు దాటింది. 'ఇంకా ఎన్నాళ్ళుంటావ'ని ఆరా తీసే ఇరుగు పొరుగు, 'అల్లుడికి ఉత్తరం రాయనా' అనే తండ్రి నిస్పృహాయత ఆమెని కృంగదీస్తూనే వున్నాయి.

"ఛ... మనలో మనకి క్షమాపణ లేవిటండీ" అంది సుజాత అతనికి చేరువై 'సుజా' అంటున్న జగన్నాథం చేతులలో ఒదిగిపోయింది సుజాత!

★ ★ ★

***(వనిత, మంత్లీ ; 1984)***